ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 సంచిక : 5 జనవరి 2016

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 12/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
23-09-2015
జిన్నూరు
11-12-2015
పంజావేమవరం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2015 జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రామకృష్ణుడు పరమహంస, రమణుడు మహర్షి. పూర్వం హిమాలయ పర్వతాలలో హంసలు ఉండేవి. హంస దగ్గర ఒక గుణం ఉంది. మీరు పాలు, నీళ్ళు కలిపి అక్కడపెడితే నీళ్ళు వదిలివేసి, పాలు తాగి వెళ్ళిపోతాయి. రామకృష్ణుడు కూడా ఈ సృష్టిలో ఉన్న మంచిని తీసుకొని చెడ్డను వదిలేసాడు. అందుచేత ఆయన రామకృష్ణ పరమహంస అని పిలువబడ్డాడు. రమణమహర్షి అని నామకరణం చేసింది గణపతిశాస్త్రిగారు. ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు వెంకటరమణ. ఋషి అంటే ఉన్న వస్తువును ఉన్నట్లుగా దర్శించినవాడు ఋషి. ఇప్పుడు మనకు నేను అంటే దేహం ఎలా స్ఫురిస్తోందో అలాగే నేను అంటే ఆయనకు బ్రహ్మపదార్థం స్ఫురిస్తోంది కాబట్టి, హృదయంలో ఉన్న సత్యాన్ని దర్శించిన మహాత్ముడు కాబట్టి గణపతిశాస్త్రిగారు ఆయనకు మహర్షి అని పేరు పెట్టారు. కాని గణపతిశాస్త్రిగారు ఏమన్నారు అంటే భక్తులు ఎవరూ ఆయనను రమణమహర్షి అని పిలవకండి, భక్తులు ఆయనను భగవాన్ అని పిలుచుకోండి అని చెప్పారు.

సన్యాసులకు ముఖ్యంగా రెండు కళ్ళు ఉండాలి అంటే విద్య, తపస్సు రెండూ ఉండాలి. జనసమూహాల్ని ఎడ్యుకేట్ చెయ్యాలి. గృహస్థాశ్రమంలో ఉన్న దానికి, సన్యాసాశ్రమంలో ఉన్నదానికి తేడా ఏమిటి అంటే సన్యాసాశ్రమంలో ఉన్నప్పుడు తొందరగా ఎడ్యుకేట్ అవ్వటానికి అవకాశం ఉంటుంది. స్వాములదగ్గరకు పండితులు వస్తారు, పెద్దలు వస్తారు, లోకానుభవం ఉన్నవారు, ఆత్మానుభవం ఉన్నవాళ్ళు వస్తూ

ఉంటారు. వారితో మాట్లాడటం వలన, విషయాలు చర్చించటం వలన నది ప్రవహించేకొలది విశాలమైనట్లు కాలప్రవాహంలో వారు తపోస్వరూపులు, విద్యాస్వరూపులు అవుతారు, ఈ స్వాములు కూడా చాలా విశాలం అవుతారు. కంచి పరమాచార్య 13వ సంవత్సరంలోనే సన్యాసం తీసుకొన్నారు. మాష్టారు ఉదయం, సాయంత్రం వచ్చి ఆయనకు బ్రహ్మవిద్యను భోదించేవారు, దానికి అనుగుణంగా సంస్కృతభాషను కూడా నేర్పేవారు. 6,7 తరగతి చదువుకొన్నవాడు తరువాత మహాపండితుడు అయ్యాడు. మహాస్వామి ఈ విద్యను ఎలా సంపాదించారు అంటే ఆయన దగ్గరకు మహాత్ములు వస్తారు కాబట్టి ఆయన చదువుకొన్న గ్రంథాలనుండే కాకుండా అక్కడో పువ్వు, అక్కడో పువ్వు కోసుకొని మనం దేవునికి ఎలా పూజ చేస్తామో అలాగ వచ్చిన వాళ్ళందరి దగ్గరా నేర్చుకొని, రామాయణంలో ఇలా చెప్పారు, బ్రహ్మసూత్రాలలో ఇలా చెప్పారు అని వారితో చర్చించి వ్యాసుడి యొక్క హృదయం పట్టుకొని అది ఆయన హృదయంలో కలుపుకునేవాడు, వాడు పరమాచార్యుడు. కొంతమందికి విద్య ఉంటుంది కాని తపస్సు ఉండదు కాని పరమాచార్యుడికి విద్య ఉంది, దానితోపాటు తపస్సు ఉంది. విడి పూలు ఎలా సంపాదించి దేవుడిని పూజిస్తామో అలాగ అనేకమంది పండితులలో ఉన్న వారి అనుభవాలను సేకరించి ఆయన మహాస్వామే కాకుండా మహాపండితుడు అయ్యాడు. ఆయన ప్రజలను విపరీతంగా ప్రేమించాడు. ఎవరైనా ఏదైనా కావాలని వస్తే ఆయన ఎప్పుడూ వెళ్ళిపోమని చెప్పలేదు. ఆఫీసుకు వెళ్ళండి, వాళ్ళు ఏదైనా ఇస్తే పుచ్చుకోండి, ఉంటే ఇస్తారు అని చెప్పేవారు. మీకు ఉన్నదాంట్లో ఎంతో కొంత వారికి ఇచ్చి పంపండి అని మహాస్వామి చెప్పేవారు.

మహాస్వామి ఎలా మాట్లాడతారు అంటే మీరు జ్ఞానే, రమణమహర్షిగారు జ్ఞానే అని ఎవరైనా పండితుడు ఆయనతో అంటే అలాగా, నేనూ జ్ఞానేనా రమణమహర్షిగారు జ్ఞానేనా, జ్ఞానం ఒకటిగా ఉంటుంది కాని రెండుగా ఉంటుందా? అనేవారు. ఇంక ఆ పండితుడు మాట్లాడలేడు. సత్యం అనేది, జ్ఞానం అనేది ఒకటిగానే ఉంటుంది కాని మీరు దానిని రెండు చేస్తున్నారు ఏమిటి అనేవారు. ఆయన హృదయంలో ఉన్న క్లారిటీ చూడండి. ఆ స్థాయికి వెళ్ళాక వారికి అసూయ, ద్వేషం ఇటువంటివి ఉండవు. అంటే జ్ఞానప్రవాహంలో అవి అన్నీ సహజంగా పోతాయి. పాల్ బ్రంటన్ మొదటలో కంచిపరమాచార్యులవారి దగ్గరకు వెళ్ళాడు. పరమాచార్య బ్రంటన్‌తో ఏమని చెప్పారు అంటే నేను ఎక్కువ కాలం నీతో గడపలేను, నాకు వెనకాల ఆశ్రమం ఉంది. ఎక్కడా బంధాలు లేకుండా ఉన్న స్వామి ఒకడు

తిరువణ్ణామలైలో ఉన్నాడు. ఆయన కాలాన్నంతా నీకోసం ఇవ్వగలడు. తిరువణ్ణామలైలో రమణమహర్షి అనే పేరుతో పిలువబడుతున్న ఆయనను కలవకుండా ఈ దక్షిణ భారతదేశాన్ని విడిచిపెట్టను అని నాకు మాట ఇయ్యి బ్రంటన్ అని పరమాచార్య చెపితే, బ్రంటన్ రమణాశ్రమం వచ్చి రమణమహర్షిని కలిసాడు. తరువాత ఆయన ఎ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా అనే గ్రంథంలో రమణమహర్షి గురించి వ్రాసారు. ఆ పుస్తకంలో నేను ఎవడను గురించి వివరంగా అందులో చర్చించాడు. అది చదివి ప్రపంచం అంతా అక్కడికి వచ్చి కూర్చుంది. పరమాచార్య భగవద్గీతలో ఉన్న చిన్న విషయాలను కూడా మనకు విసుగు వచ్చేలాగ వర్ణిస్తారు అంటే చిన్న చిన్న విషయాలను కూడా వివరంగా విశ్లేషణ చేస్తారు. భగవంతుడు అలా ఎందుకు చెప్పాడు అని ఆయన హృదయాన్ని పట్టుకొని ఊగిస్తాడు. అయితే స్వాములు విద్య, తపస్సు రెండూ సంపాదిస్తూ సమాజానికి ఉపయోగపడుతూ, సమాజం వారికి ఏదైనా ఆఫర్ చేస్తే తీసుకోవటంలో సన్యాసులకు తప్పలేదు. ఎందుచేతనంటే సమాజం ఇచ్చిన ధనాన్ని తిరిగి ఏదో రూపంలో సమాజానికే ఇస్తూ ఉంటారు. బోంబే ప్రాంతం బాగా ధనవంతమైన ప్రాంతం. అక్కడకు ఎప్పడైనా పరమాచార్య వెళితే లక్షలలో డబ్బు తెచ్చి యిచ్చేవారు. ఆయన ఎంత దూరంగా ఉండేవారు అంటే మీరు ఆఫీసులో కనుక్కోండి, మాకు డబ్బు నిలువ ఉంటే మీరు ఇవ్వటం ఎందుకు? డబ్బు తక్కువ ఉందని చెపితే ఇవ్వండి లేకపోతే ఇంకో మంచిపనికి ఉపయోగించవచ్చు కదా అనేవారు, అలా చెప్పిన ఆచార్యుడిని నేను చూడలేదు. ఆయన అంత వైరాగ్య పురుషుడు.

అక్షరమణమాల అంటే అక్షరాలతో తయారుచేసిన పెళ్లి నాటి మాల. పెళ్లికి మామూలుగా పుష్పాలతో మాలను చేస్తారు కాని ఇది అక్షరాలతో తయారుచేసారు. ఇక్కడ అరుణాచలేశ్వరుడు పెండ్లి కుమారుడు, భగవాన్ పెండ్లి కుమార్తె. భగవాన్ ఏమంటున్నారు అంటే ఓ అరుణాచలేశ్వరుడా! అక్షరాలతో తయారు చేసిన ఈ దండను నేను నీ మెడలో వేస్తున్నాను, మరి నువ్వు కూడా దండ వెయ్యాలి కదా! నేను చేసానని నువ్వు కూడా అక్షరాలతో చేసిన దండను నా మెడలో వెయ్యవద్దు, నీ అనుగ్రహం అనే దండను నా మెడలో వేసి నీ స్వరూపాన్ని నాకియ్యి అరుణాచలేశ్వరుడా అని అక్షరమణమాలలో భగవాన్ వివరంగా చెప్పారు. అక్షరమణమాల గురించి ఎవరైనా తలపెడితే ఇదే మనకు కడుపు నిండా అన్నం పెట్టింది కదా అనేవారు భగవాన్.

**కనిన జనని కన్న ఘనదయా దాయకా**

**ఇదియా అనుగ్రహమరుణాచలా.**

భౌతికమైన ప్రేమలలో తల్లిప్రేమ గొప్పది. అబ్బాయి ఎంత చెడ్డవాడు అయినా మా అబ్బాయి మంచివాడే అని తల్లి అంటుంది. అది తల్లి హృదయం. ఒకవేళ ఏదైనా లోపం ఉంటే సరిచేయాలి అని చూస్తుంది కాని మీకు మల్లే బజారులోపడేసి విమర్శించదు. ఈ లోకానికి సంబంధించినంతవరకు తల్లిప్రేమతో ఏ ప్రేమను పోల్చలేము కాని ఓ అరుణాచలేశ్వరుడా నీ ప్రేమతో పోలిస్తే తల్లిప్రేమ ఏపాటిది? తల్లి మీ భౌతిక అవసరాలను తీరుస్తుంది కాని బ్రాహ్మీస్థితికి మిమ్మల్ని తీసుకొనిపోయేది గురువు ప్రేమ మాత్రమే. గురువు అనుగ్రహం మీమీద వర్షించినప్పుడు మీ శ్వాస ఆగిపోతుంది. గోదావరికి వరద వచ్చినప్పుడు గండికొడితే ఊళ్ళు ఎలా మునిగిపోతాయో అలాగ గురువు అనుగ్రహాన్ని పరిమితులు లేకుండా విడిచిపెడితే తట్టుకోలేక మీ శరీరాలు చనిపోతాయి. అందుచేత ఎప్పుడు అనుగ్రహించాలి, ఎలా అనుగ్రహించాలి, ఎక్కడ అనుగ్రహించాలి, మీ జీవితాన్ని ఎప్పుడు తిప్పాలి అది అంతా గురువు చూసుకొంటాడు. మీరు తొందరపడవద్దు. మీరు భగవంతుడికి స్వాధీనం అయ్యాక మిగతా విషయాలు అన్నీ ఆయనే చూసుకొంటాడు. మీరు మరచిపోతారు కాని భగవంతుడికి మరపు ఉండదు. మరపు, జ్ఞాపకం ఇవి జీవలక్షణాలు. గురువు చెప్పే టీచింగ్‌ను అందుకోవటానికి నీకు అర్హత ఉండాలి కదా! నీ మెదడు ఎంతోకొంత ముగ్గాలి, గ్రహించే శక్తి దానికి రావాలి. ఏమండీ మీరు ఏదో చెపుతున్నారు, మాకేమీ అర్థం కావటంలేదు అని భగవాన్‌తో అంటే అవును మరి మీకు వాసనల యొక్క వేగం అంత ఎక్కువగా ఉన్నప్పుడు నా టీచింగ్‌ను బ్రెయిన్‌కు పట్టనివ్వవు. వాసనాక్షయం అయితేకాని పూర్ణస్థితిని పొందలేరు. నాకు చెప్పాలని ఉన్నా, మీకు అర్థం చేసుకోవాలని ఉన్నా జన్మాంతరంలో నుండి వచ్చే సంస్కారాలు మీకు అర్థం కాకుండా అవి అడ్డుపడతాయి. లుక్ విత్ ఇన్. ఎన్నాళ్ళు ఇలా బయటకు చూస్తారు, లోపలకు చూడటం నేర్చుకోండి. బయటకు అందరూ బాగానే ఉన్నారు, లోపల మీరు ఎలా ఉన్నారు? మీ హృదయంలో ఏమి జరుగుతోంది అని లోపలకు చూసుకోండి. మీకు కొంత మెచ్యూరిటీ వస్తే బయటగురువు మీకు ఏదో మంచి మాటలు చెప్పి, వెన్న ముద్దలు తినిపించి నెమ్మదిగా మీ మనస్సును లోపలకు గెంటుతాడు. నిజమైన గురువు మీ లోపలే ఉన్నాడు. ఆయనే అంతర్యామి. మీరు మనస్సును కొంత అంతర్ముఖం చేస్తే, దానిని లోపలకు గుంజుకొని మిగతా పని అంతా ఏమి చెయ్యాలో ఆయనే చూసుకొని

ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. అందుచేత మిగతా విషయాలు అనవసరం, మన మనస్సును అంతర్ముఖం చేయటం ముఖ్యం.

జీవుడు పాడైపోవటానికి లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. మిల్టన్ ఏమని చెప్పాడు అంటే మీరు అనవసరంగా కష్టపడిపోతున్నారు. మీరు దేనికోసం అయితే వెదుకుచున్నారో, అది బయట లేదు, మీ హృదయంలోనే ఉంది. బయట ఆకర్షణలనుండి మీరు విడుదల పొందితే, మీ మనస్సు కొంచెం అంతర్ముఖమైతే హృదయంలో ఉన్న స్వర్గరాజ్యం యొక్క రుచి మీకు తెలుస్తుంది అని చెప్పాడు. మీరు ఉన్నదానిని పాడుచేసుకొని మాకు మోక్షం కావాలి, మాకు స్వర్గరాజ్యం కావాలి అని అంటున్నారు. బాహ్యఆకర్షణలవలన మీకు అవసరంలేని గుణాలలో పడిపోయి, స్నేహాలలో పడిపోయి, లగ్జరీస్‌లో పడిపోయి మీరు సహజంగా ఉన్న మోక్షస్వరూపానికి దూరమైపోయి మాకు మోక్షం కావాలి, మాకు మోక్షం కావాలి అంటే మేము ఏమి చెపుతాము. ఈ చిన్న విషయాన్ని మిల్టన్ పారడైజ్ లాస్ట్‌లో అనేక రకాలుగా వ్రాసి మనల్ని రక్షించటానికి ప్రయత్నం చేసాడు. ఆయనకు చివరి రోజులలో గుడ్డితనం వచ్చినప్పటికీ పారడైజ్‌లాస్ట్‌ని డిక్టేట్‌చేసి పూర్తిచేసాడు. అందుచేత మీరు ఏదో సంపాదించాలి అనుకొంటున్నారు. మీరు ఏమి కొత్తగా సంపాదించనక్కరలేదు. ఇప్పుడు మీకు ఉన్న లోకవ్యామోహంలోనుండి, ఈ జీవుడు ఎక్కడ బంధింపబడుతున్నాడో, ఎన్ని బంధాలు మీకు బయట ఉన్నాయో అందులోనుండి విడుదల పొందటం నేర్చుకొంటే ఉన్నది అదే కదా! మోక్షం తప్పించి, స్వర్గరాజ్యం తప్పించి ఏముందీ మీ హృదయంలో. మీరు హృదయాన్ని ఖాళీ చేసుకోండి. మీ గది అంతా లగేజీతో నింపుకొని దేవుడా ఇక్కడికి వచ్చి కూర్చోమంటే ఆయన ఎక్కడ కూర్చొంటాడు, కొంచెం ఖాళీ ఉండాలి కదా! మీ హృదయాన్ని ఖాళీ చేసుకోండి. ఖాళీ అయిన హృదయంలోనే ఈశ్వరుడు తన ఉనికిని వ్యక్తం చేస్తాడు. హృదయం అంతా వాసనలు పెట్టుకొని వచ్చి నా హృదయంలో నిలబడు అంటే ఆయనకు నిలబడటానికి కొంచెం చోటు ఇవ్వాలి కదా! హృదయాన్ని ఖాళీ చేసుకోకుండా ఏవో ఒట్టి మాటలు చెప్పటం వలన ఏమీ ప్రయోజనం లేదు.

డివైన్‌లవ్, శాంతిప్రవాహం అది గురువు దగ్గరనుండే, ఈశ్వరుడి దగ్గరనుండే రావాలి. మనం చేసే ప్రయత్నం చిన్నది, మన మనస్సు ఎంత సాధన చేయగలదు? అందుచేత వచ్చేదంతా మన బిహేవియర్ పేటర్న్‌ను బట్టి అక్కడనుంచే రావాలి. మనం ఏదో ప్రయత్నం చేస్తాము, ఆ ప్రయత్నాన్ని వంపు పెట్టుకొని భగవంతుడే మనమీద శాంతి వర్షం కురిపించాలి.

మనం చేసే చిన్న చిన్న సాధనలను వంపు పెట్టుకొని ఆయనే మనల్ని అనుగ్రహిస్తాడు. మేము పెద్ద పెద్ద తపస్సులు చేసాము అంటారు. నిజంగా తపస్సు చేసేవాళ్లకి మనం తపస్సు చేస్తున్నాము అని తెలియదు. ఇక్కడ ముఖ్యం మన కర్తృత్వం లేకుండా జీవించటం నేర్చుకోవాలి. మీకు ఎప్పుడైనా అశాంతి వచ్చినా, దుఃఖం వచ్చినా దానికి కర్తృత్వమే కారణం. భయం, కోరిక ఇవి మీకు దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. ఈ పని చేస్తే మనకు భవిష్యత్‌లో భయం వస్తుందేమో, ఈ పని చేస్తే భవిష్యత్‌లో మనకు దుఃఖం వస్తుందేమో, ఈ పని చేస్తే భవిష్యత్‌లో మనకు ఉన్న కోరికలు ఇంకా పెరిగిపోతాయేమో ఇవన్నీ ఆలోచించుకొని జాగ్రత్తగా పనిచేయండి. భవిష్యత్‌లో మీకు దుఃఖం తీసుకొని వచ్చే మాటలు, భయం తీసుకొని వచ్చే మాటలు మాట్లాడవద్దు. మీరు ముందుగా జాగ్రత్తపడి అటువంటి పనులజోలికి, అటువంటి మాటల జోలికి వెళ్లవద్దు అని చెపుతున్నాడు. మీకు ఇంత వివరంగా గురువు మాత్రమే చెప్పగలడు. ఈశ్వరుడు జడ్జిలాంటివాడు. మీరు చేసే పనులను రికార్డు చేసి జడ్జిమెంట్ వ్రాస్తాడు. గురువు అలా కాదు ఆయన మిమ్మల్ని రక్షిస్తాడు. మీరు చేసిన కర్మను కూడా ఆయన నెత్తిమీద పెట్టుకొని మోసి ఆయన స్వరూపాన్ని మీకు ఇవ్వటానికి ప్రయత్నం చేస్తాడు, వాడు గురువు. అయితే నా విషయంలో వచ్చిన అదృష్టం ఏమిటి అంటే నేను గురువును ఎక్కడా ఎన్నుకోలేదు, నన్నే గురువు ఎన్నుకొన్నాడు. అందుచేత ఎప్పుడైనా చంటిపిల్లవాడు తల్లిని తన్నినట్లు నేను గురువును ఎప్పుడైనా తిట్టినా ఆయన నన్ను విడిచిపెట్టలేదు. అన్ని అవస్థలలోను ఆయన గొడుగు నా నెత్తిమీద ఉండనే ఉంది, అది గురువు యొక్క వైభవం. నీకు ఏ ప్రమాదం వచ్చినా ఆయన ముందే చూసుకొంటాడు. మీరు ఎన్నుకొంటే గురువులను మారుస్తూ ఉంటారు. ఆయన ఎన్నుకొంటే మీరు గురువును మార్చే అవకాశంలేదు, ఆ బంధంలోనుండి కదలలేరు.

మాష్టారు ఏమి చేస్తారు అంటే మీరు బడిలో అల్లరిచేయకుండా ఉంటే ఆయనకు సరిపోతుంది. గురువు అలాకాదు, ఆయన మిమ్మల్ని 24 గంటలు పరిశీలన చేస్తాడు. మీరు ఇంటి దగ్గర ఎలా ఉంటున్నారు అనేది కూడా గురువు చూస్తాడు. రామకృష్ణుడు అలా పరిశీలించేవాడు, మీరు ఇంటి దగ్గర ఎలా ఉంటున్నారు అని ఆరా తీసేవాడు. వివేకానందకి కూడా రామకృష్ణ గురించి కొంత కాలం అర్థం కాలేదు. మా ఇంటి దగ్గర గొడవలు మీకు సంబంధం ఏమిటి? అందుకే మిమ్మల్ని కలకత్తా సిటీలో పిచ్చివాడు

అనుకొంటున్నారు అనేవాడు. ఏమయ్యా నరేన్ నన్ను సిటీలో పిచ్చివాడు అనుకొంటున్నారా, అంత చెడ్డవాడిని అయిపోయానా అనేవాడు రామకృష్ణుడు. వారికి సృష్టిలేదు ఇంక వారికి మంచి ఏమిటి? చెడ్డ ఏమిటి? పూరికే అలా నటించేవాడు. అప్పడు నరేంద్రుడు ఇంకా చిన్నవాడు, రామకృష్ణుడిని ప్రోపర్‌గా అర్థం చేసుకోలేకపోయాడు. పెద్దవాడు అయ్యాక అప్పడు గురువు యొక్క వైభవం ఆయనకు తెలిసింది. నరేంద్రుడు ఎలా మాట్లాడినా వాడి హృదయంలో స్వార్థంలేదు, కపటంలేదు, వాడు మంచివాడు. వాడికి భూమి అక్కరలేదు, డబ్బు అక్కరలేదు, అధికారం అక్కరలేదు, స్త్రీ అక్కరలేదు, అటువంటి నరేంద్రుడు మనకు ఎక్కడ దొరుకుతాడు. అందుచేత నరేంద్రుడిని దగ్గర కూర్చోబెట్టుకొని స్పెషల్ ట్రైనింగ్ ఇచ్చాడు రామకృష్ణుడు. నిన్ను ఎవరైనా తిడితే ఏమనుకొంటావు నరేన్ అని రామకృష్ణుడు అడిగేవాడు. వాళ్లని తుంటరులు అనుకొంటాను అని చెప్పాడు. అంత దూరం వెళ్లిపోకు. తుంటరులు అనుకొంటావా, అలా అనుకోవద్దు. వాళ్లు కూడా మంచివారే ఎప్పడైనా జారిపోతారు. నిన్ను విమర్శించినంతమాత్రంచేత వారు తుంటరులు అని అలా పెద్ద పెద్ద మాటలు అనకూడదు నరేన్ అని ఇలా చిన్న చిన్న విషయాలు కూడా ప్రోపర్‌గా ట్రైనింగ్ ఇస్తూ వచ్చాడు రామకృష్ణుడు. ప్రతీ చిన్న విషయానికి కేర్ తీసుకొంటూ చిన్న వయస్సునుండి నరేంద్రుడిని తయారు చేయటం వలన ఆయన వరల్డ్ ఫేమస్ అయ్యాడు.

సురేంద్రనాథ్ బెనర్జీ, దేవేందర్‌నాథ్ ఠాగూర్ ఇలా కలకత్తాలో ఉన్న పెద్దవాళ్ల గురించి వీరు విద్యలో పెద్దవారు, వీరు ధనంలో పెద్దవారు అని మాటల మధ్యలో నరేంద్రుడు రామకృష్ణుడితో అనేవాడు. అది రైటే నరేన్, వారు పెద్దవాళ్లు అయ్యి ఉండవచ్చు, నేను కాదనటం లేదు కాని వాళ్లందరికంటే నువ్వే పెద్దవాడవు అని రామకృష్ణుడు అంటే, వీడు పిచ్చివాడు అని టౌనులో చెప్పకొంటున్నారు, ఆమాట అబద్ధం కాదు ఆమాట నిజమే అనుకొనేవాడు నరేంద్రుడు. భవిష్యత్‌లో నరేంద్రుడి జీవితం ఎలా ఉంటుంది అని కళ్లతోటి దర్శించగలడు రామకృష్ణుడు కాని అది నరేంద్రుడికి అర్థం కావటం లేదు. రామకృష్ణుడి కంటే వివేకానంద ఎక్కువ పని చేసాడు అని ఇప్పడు కూడా కొంతమంది అంటారు కాని అలా అనకూడదు. అసలు పునాదిని మనం మర్చిపోకూడదు. ఏదో వరల్డ్ పాపులర్ అయ్యాడని రామకృష్ణుడికంటే మించినవాడు వివేకానంద అని అనకూడదు. వివేకానంద అంత అభివృద్ధిలోనికి రావటానికి ఎవరు పునాది వేసారు? అది మనం మర్చిపోకూడదు.

కొంతమంది తెలియక అలా మాట్లాడుతున్నారు కాని అది చాలా పొరపాటు. అది తల్లిని వదిలేసి బిడ్డను గురించి మాట్లాడినట్లు ఉంటుంది.

నీకు పొట్టా, బట్టా మటుకు తల్లి చూస్తుంది కాని గురువు నీలోపల జీవితాన్ని చూస్తాడు. లోపల జీవితాన్ని సరిచేసేవాడు, నీ బుద్ధిలో ఉన్న వంకరలను సరిచేసేవాడు గురువు మాత్రమే, అది గురువుకే సాధ్యం. అంతేకాదు నీ హృదయాన్ని విశాలం చెయ్యటానికి, నిన్ను మహోన్నతుడిని చేయటానికి ఏ విషయాలు అయితే అడ్డువస్తున్నాయో చూసుకొని, ఆ విషయాలను ఎప్పడు తొలగించాలి, మీ జీవితాల్ని ఎప్పడు మలుపు తిప్పాలి అని గురువు ప్రతీక్షణం వాచింగ్‌లో ఉంటాడు. చెడ్డశిష్యుడు ఉండవచ్చుకాని చెడ్డగురువు ఉండడు. తల్లి నీ భౌతికమైన అవసరాలను మాత్రమే తీర్చగలదు. గురువు నీ ఆధ్యాత్మిక అవసరాలను తీరుస్తాడు. వాడు నిన్ను అనుగ్రహించి నీ మనస్సును అంతర్ముఖం చేస్తాడు. నువ్వు గురువు పట్ల ఎలా ప్రవర్తించినా నీ పట్ల ఆయన దయ అనే వర్షం కురిపిస్తాడు. నువ్వు గురువుకి విషం పోసి కప్పు ఇస్తే ఆయన నీకు కాఫీ పోసి కప్పు తిరిగి ఇస్తాడు, వాడు గురువు. తల్లి ఎప్పడైనా ఆస్తులకోసం నీ మీద దావాలు వేయవచ్చుకాని గురువు ఎప్పడూ అమృతవర్షం, దయావర్షం నీ శిరస్సుమీద కురిపిస్తూనే ఉంటాడు. వాడు దయాళువు. వాడి స్వరూపమే దయ, వాడి స్వరూపమే శాంతి, వాడి స్వరూపమే జ్ఞానం. వాడికి రియాక్షన్ అంటూ ఏమీ ఉండదు. సదా మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటాడు. మీరు ఆయనను తిట్టినా, రాళ్ళుపెట్టి కొట్టినా సదా ఆయన అనుగ్రహం మీ శిరస్సు మీద వర్షిస్తూనే ఉంటుంది. గురువు యొక్క దయ నీకు అనుభవంలోనికి వచ్చాక గురువు యొక్క దయ ఇలా ఉంటుందా? ఆయన అనుగ్రహం ఇలా ఉంటుందా? అని అప్పడు నీకు తెలుస్తుంది కాని అప్పటివరకు ఆయన వైభవం నీకు తెలియదు.

మనస్సును తీసుకొని వెళ్ళి హృదయాకారం చేయటానికి మనం ప్రయత్నం చేస్తాము. ఒకో ఇంద్రియానికి ఒకో విషయం ఉంటుంది. ఆ విషయం ఆ ఇంద్రియాన్ని లాగుతూ ఉంటుంది. మనిషి పాడైపోవటానికి వంద ఆకర్షణలు అక్కరలేదు, ఒక్క ఆకర్షణ సరిపోతుంది. బహిర్ముఖమైన మనస్సును విషయాలు తొందరగా ఆకర్షిస్తాయి. అందుచేత ఆ ప్రమాదంలో పడకుండా గురువు నిన్ను అంతర్ముఖపరుస్తాడు. అరుణాచలేశ్వరుడితో భగవాన్ ఏమంటున్నారు అంటే నేను పెద్దవాడిని అయిపోదాము అనుకొన్నాను, అందరూ గొప్పగా చెప్పకొనేలా అయిపోదాము అనుకొన్నాను. నన్ను లోకానికి వ్యర్థునిగా ఎందుకు చేసేసావు.

ఏదో నిన్ను అందరూ దేవుడు అని చెప్పకొంటూ ఉంటే నేను వచ్చాను, తీరా వచ్చాక నన్ను ఎందుకు పనికిరానివాడిగా చేసావు అంటే అర్థం ఏమిటి అంటే నాలో ఉన్న జీవలక్షణాలను వేరుతో సహా తీసేసావు. నేను పెద్దవాడిని అయిపోవాలి, నన్ను అందరూ మెచ్చుకోవాలి అనుకొనేవి అన్నీ జీవలక్షణాలు, ఇవన్నీ పనికిరాని లక్షణాలు. తాడులో ఉన్న గడ్డిపరకలు అన్నీ తీసేస్తే ఇంక తాడు ఏమీ ఉండదు అలాగే జీవలక్షణాలు అన్నీ తీసేస్తే ఇంక ఆ జీవుడికి అస్థిత్వం ఉండదు. ఎవడైతే ఈ శరీరం మరణించిన తరువాత ప్రయాణం చేస్తాడో వాడిని ఇక్కడే నువ్వు తీసి పడేస్తున్నావు, ఇంక ప్రయాణం చేసేవాడు ఎవడు ఉంటాడు? ఇక్కడ గురువు చేసే పని చూడండి.

మీరు వెళ్ళిపోతున్నారు, మేము ఉండిపోతున్నాము అని భగవాన్‌తో ఎవరైనా అంటే "నేను ఎక్కడికి వెళ్ళిపోతాను. నేను లేని చోటు అంటూ ఉంటే అక్కడికి వెళ్ళిపోతాను నేను లేని చోటేది? నేను అన్ని చోట్లా ఉన్నప్పడు ఎక్కడికి వెళతాను, వెళ్ళటానికి స్థలం ఉండాలి కదా!". మీ శరీరం చనిపోతోంది, ఈ శరీరం చనిపోతే మమ్మల్ని ఎవరు అనుగ్రహిస్తారు అని భగవాన్‌ను అడిగితే "ఇప్పడు ఈ శరీరం ఉంది, ఈ శరీరమా మిమ్మల్ని అనుగ్రహించేది. ఈ శరీరం చనిపోయినప్పడు ఈ తుక్కును తీసుకొని వెళ్ళి ఎక్కడోచోట పడేస్తారు. ఈ తుక్కా మిమ్మల్ని అనుగ్రహించేది. ఈ శరీరం ఉన్నప్పడు కూడా ఈ శరీరం మిమ్మల్ని అనుగ్రహించటంలేదు. ఏదైతే మిమ్మల్ని అనుగ్రహిస్తోందో దానికి చావులేదు. ఈ చనిపోయేది మిమ్మల్ని అనుగ్రహించదు. దేనికైతే చావు లేదో అది శరీరం పోయిన మిమ్మల్ని అనుగ్రహిస్తూనే ఉంటుంది." ఈ శరీరం చనిపోయినప్పడు బంధువులతోటి, స్నేహితులతోటి మనకు సంబంధం తెగిపోతుంది కాని గురువుతోటి సంబంధం తెగదు. గురువు అంటే ఆ శరీరంకాదు, చైతన్యం. అందుచేత ఆయనతో సంబంధం తెగదు. ఇవన్నీ మేము చెప్పాలని చెప్పటంలేదు, చెప్పకుండా ఉండలేక చెపుతున్నాము. ఎప్పడైనా ఇంక చెప్పకూడదు అనుకొన్నా ఏదో మన శరీరం ఉన్నంతకాలం చెపుదాము, అసలు శరీరం చనిపోయిన తరువాత చెప్పేది ఏముంటుంది అనిపిస్తుంది. మీరు మాట్లాడటం మానేయండి ఎవరైనా వస్తే మిమ్మల్ని చూసి వెళ్ళిపోతారు అని డాక్టర్లు చెపుతున్నారు. ఏదోవాళ్ళ డ్యూటీ ప్రకారం శరీరానికి సంబంధించింది వారు చెపుతారు. చూసి వెళ్ళిపోతే, చూసి జ్ఞానం సంపాదించేయటానికి వీళ్ళు ఏమన్నా సనత్‌కుమారులా? అంత మెచ్యూర్డ్ బ్రెయిన్సా? వారికి ఇంటి దగ్గర ఏవో గొడవలు ఉంటాయి, బంధాలు ఉంటాయి, జీవలక్షణాలు ఉంటాయి కదా!

సనత్కుమారుడు వాళ్ళు మెచ్యూర్డ్ బ్రెయిన్స్ కాబట్టి, పండిపోయి ఉన్నారు కాబట్టి దక్షిణామూర్తి వారిని మౌనంతోనే అనుగ్రహించేసాడు.

నువ్వు నా మనస్సును ఆకర్షించి, దానిని అంతర్ముఖపరచి, దానికి అస్థిత్వం లేకుండా చేసి నన్ను లోకానికి పనికిరాకుండా చేసావు. ఫలానా శరీరం నాది, ఫలానా మనస్సు నాది, ఈ మంచి పని నేను చేసాను అనేటువంటి భావాలు నాకు రాకుండా చేసేసావు. నేను, నేను అని చెప్పే దేహగతమైననేనును నాకు తెలియకుండానే తీసేసావు. నాలోని జీవలక్షణాలను పూర్తిగా తీసేసావు. మరి తరువాత పని కూడా నువ్వు చేయాలి కదా! నువ్వు వేరు, నేను వేరు అనే భావన లేకుండా నువ్వు, నేను ఐక్యమైపోవాలి కదా! నన్ను బ్రాహ్మీస్థితికి చేర్చాలి కదా! నువ్వు వేరు, నేను వేరు అనే వేరుభావన పోయి ఒకటిగా ఉండేటట్లు ఆ వన్‌నెస్‌ను నాకు అనుగ్రహించు.

కంచి పరమాచార్య ఒకసారి గుంటూరులో మాట్లాడుతూ మీరు అవసరం లేని మాటలు మాట్లాడకండి. మీరు ఇంట్లో అయినా సరే అవసరం అయినప్పుడు మాట్లాడవచ్చు. అవసరం లేకుండా రోడ్డు మీద దుమ్ము అంతా పోగుచేసుకొని వచ్చి మీ ఇంట్లో వారితో మాట్లాడవద్దు, వాళ్ళని పొల్యూట్ చేయకండి, వారికి మసి అంటించవద్దు. మీరు అవసరం లేని మాటలు మానేసి ఎక్కువగా మౌనంగా ఉండటం వలన పెద్ద ప్రయత్నం అక్కరలేకుండా మాయ మీకు దూరమైపోతుంది అని పరమాచార్య చెప్పారు. అందుచేత మహాత్ములతోటి, పెద్దవారితోటి స్నేహం ఊరికేపోదు. ఇటువంటి మాటలు వాళ్ళు నాలుగు చెపితే అందులో మనం ఒక్క వాక్యం పట్టుకొన్నా సరిపోతుంది, మనం బాగుపడతాము. తులసీదాసు ఒక్కమాటతోటే బాగుపడ్డాడు. తులసీదాసుకు భార్య అంటే బాగా ఇష్టం. అంతకుముందు ఆయన తల్లిదండ్రుల ద్వారాకాని, స్నేహితులద్వారాకాని ఎవరి ద్వారా కూడా ప్రేమ ఎలా ఉంటుందో ఆయన పొందలేదు. ఆయనకు భార్య తప్పించి ఇంకో లోకం లేదు. తులసీదాసు భార్య ఒకసారి ఆయనతో చెప్పకుండా పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆయన మరుసటి రోజున భార్య దగ్గరు వెళ్ళిపోయాడు. నిన్నే కదా మనం అక్కడనుండి వచ్చింది, అప్పడే వెంటపడ్డాడు ఏమిటి అని ఆవిడ భౌతికంగా తీసుకుంది. ఆవిడపేరు రత్నమాల. తులసీదాసు గుమ్మంలోకి వచ్చాడు, కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళు ఇవ్వలేదు "తులసీ నా మీద నీకు ఎంత ప్రేమ ఉంది, నేను నిన్నే కదా వచ్చాను, ఇవాళ నా వెంట పడ్డావు, నీకు నా మీద ఉన్న ప్రేమ రాముడి మీద ఉంటే నువ్వు సేజ్ అయిపోదువు" అంది. "ఓ యు ఆర్

కరెక్ట్, నువ్వు చెప్పింది సత్యమే అని ఇలా రౌండ్ తిరిగాడు, రత్నమాలా నేను వెళ్లిపోతున్నాను" అని చెప్పి వెళ్లిపోయాడు. రాముడిని జపించాడు, తులసీ రామాయణం వ్రాసాడు. హి బికేమ్ ఎ సేజ్. తులసీరామాయణంలో అంతా మాంసమే, ఎముకలు కనబడవు అంటే అంత మధురంగా వ్రాసాడు. తులసీదాసుకు పెళ్లాం తప్పించి ఇంకో లోకం లేదు అని మీరు ఇక్కడ అపార్థం చేసుకోకూడదు. వాడు చిన్నప్పటినుండి ఎవరిచేత ప్రేమించబడలేదు, అసలు ప్రేమ అంటే ఏమిటో వాడికి తెలియదు. ఆయన పెళ్లి అవ్వకముందు ఎలా జీవించాడు అనేది మనం చూడకుండా తులసీదాసును విమర్శించకూడదు.

ఉన్నది ఒక్కటే అసలు ద్వితీయం అంటూ లేదు. నీ మనస్సే రెండుగా కనిపిస్తోంది. భగవంతుడు గీతలో ఏమని చెప్పాడు అంటే నేను అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి వారి ప్రారబ్ధమునకనుసరించి ఆ జీవులను ఆడిస్తున్నాను అని చెప్పాడు. ఇది ఒక్కటే నిజం. ఈ గుడులు, గోపురాలు, బయట కనిపించే పూజలు, యాగాలు మిగిలినవన్నీ మనో కల్పితాలు. ఈశ్వరుడు ఉన్నమాట నిజం. బయట ఈ బొమ్మలు అన్నీ మన మనస్సుకు సపోర్టు కోసం కల్పించుకొన్న గొడవలే. ఓ అరుణాచలేశ్వరుడా! నువ్వు సర్వజ్ఞుడవు అంతే కాదు సర్వవ్యాపకుడవు. నీకు తెలియకుండా ఈ సృష్టిలో ఏదైనా జరుగుతోందా? ఏది జరిగినా ఆయనకు తెలియకుండా జరగటానికి వీలు లేదు. ఈశ్వర సంకల్పం బలీయమైనది. అది అలా ఎందుకు జరిగింది అంటే పూర్వజన్మలకీ దానికీ సంబంధం ఉంటుంది. భగవాన్ ఆయన జీవితంలో ఏ సంఘటనకు ఆశ్చర్యం వ్యక్తపరచలేదు. అది అలా ఎందుకు జరిగింది, ఇది ఇలా ఎందుకు జరిగింది అని ఆయన ఎప్పుడూ అనలేదు. ఒక మనిషికి గ్రోత్ వస్తూ ఉంటే మీరు అసూయపడినంత మాత్రం చేత అది ఆగిపోదు, మనం ఆపుచేస్తే అది ఆగదు, అది ఈశ్వరుని ఆజ్ఞ. అసలు సృష్టి అంతా ఆయన స్వాధీనంలో ఉంది. మీరు మా ఇంటికి వచ్చి చూసి వెళ్లండి అని ఎవరైనా భగవాన్‌తో అంటే మీ ఇంటిలో నేను ఉన్నాను కదా! మీరు ఏ కిటికీలో ఏమి పెట్టుకొన్నారు, గదిలో ఏమి పెట్టుకొన్నారు నన్ను చెప్పమంటారా? మీ ఇంటిలో ఏమి జరుగుతోందో చెప్పమంటారా? మీ ఇంటిలో నేను లేకపోతే రావచ్చు, నువ్వు పిలవకముందే అక్కడ ఉన్నాను కదా! ఇంక మా ఇంటికి రండి అని నన్ను అడుగుతారు ఏమిటి? అంటే ఆయన సర్వవ్యాపకుడు ఒక కాలంలో ఉండి ఇంకో కాలంలో లేకపోతే, ఒక ప్రాంతంలో ఉండి ఇంకో ప్రాంతంలో లేకపోతే అది సత్యం కాదు. ఎప్పుడూ ఉండేదే నిజం.

**ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువారు**

**ఎవరు ఇది నీ జాలము అరుణాచలా!**

అరుణాచలేశ్వరుడా! ఉన్నది నువ్వు ఒక్కడివే. ఈ ప్రపంచం అంతా నీ ఇంద్రజాలము. నువ్వు సర్వజ్ఞుడవు, సర్వవ్యాపకుడవు. సర్వవ్యాపకుడవైన నీకు తెలియకుండా నా మనస్సులోకి రాగల శక్తి ఎవరికి ఉంది. అంటే అవసరంలేని విషయాలు, ఉపయోగంలేని విషయాలు నా హృదయంలోనికి వస్తున్నాయి. నన్ను పాడుచేసే విషయాలు నా బ్రెయిన్‌లోకి వస్తున్నాయి. చెడ్డ తలంపులు, ఉపయోగంలేని తలంపులు నాకు వస్తూ ఉంటే అవి నీకు తెలియకుండా వస్తున్నాయా? ఏమి తెలియనట్లు నటిస్తున్నావు ఏమిటి? నాకు ఆ గొడవలు ఏమీ తెలియదు అంటే నమ్మటానికి మేము అంత తలకాయ లేకుండా ఉన్నామా? అందుచేత ఆ గొడవలు ఏమి నాకు తెలియదు అని నువ్వు అబద్దాలు చెప్పినా మేము నమ్మటానికి సిద్ధంగా లేము. అందుచేత మాకు అవసరం లేని తలంపులు వస్తూ ఉంటే, మమ్మల్ని పాడుచేసే తలంపులు వస్తూ ఉంటే నువ్వు వాటిని కంట్రోల్ చెయ్యి, అవి రాకుండా చూడు. అది నీ అనుగ్రహానికే సాధ్యం. ఈ గొడవలు నాకు తెలియదు అని ఎస్కేప్ అవ్వటానికి ప్రయత్నం చేయకు. చెడ్డ తలంపులు ఒకోసారి చాలా వేగంగా వస్తాయి. అవి మాకంటే శక్తివంతమైనప్పుడు మేము ఫెయిల్ అయిపోతాము. అందుచేత అవి వచ్చేటప్పుడు నీకు తెలుస్తుంది కాబట్టి వాటిని తొలగించే బాధ్యత, అవి రాకుండా చూసే బాధ్యత నీకు ఉంది. నాపట్ల దయ చూపించి ఈ పని చేసిపెట్టు అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్. ఈ విషయాలు, చావు పుట్టుకలు ఇవి అన్నీ ఎక్కడనుండి వచ్చాయి, ఇది అంతా నీ మాయ. నువ్వు తప్పించి ఈ సృష్టిలో ఏమీలేదు, ఆ అనుభవం మాకు కలుగజెయ్యి అంటున్నారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-12-2015 పంజావేమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇక్కడ ఆశ్రమానికి శ్రీ నాన్న రమణ ఆశ్రమం అని పేరు పెట్టారు. నాన్నగారు అనేవారు భగవాన్‌కంటే వేరుగా లేరు. అందుచేత మాలో మేము నమస్కారములు పెట్టుకోవటం కూడా అలవాటు లేదు. మాకు భగవాన్ అంటే ఒక దేవతాస్వరూపుడు అనికాని, ఒక ఋషిఅనికాని అటువంటి భావనలేమీ లేవు. మా కుటుంబ సభ్యుడు అనిపిస్తుంది. శుచి,